సాక్షి
వైఎస్సార్ జిల్లా
గురువారం । 12 । సెప్టెంబర్ । 2024



వైవీయూలో విద్యార్థుల మధ్య ఘర్షణ

వైవీయూలో నివురుగప్పిన నిప్పులా ఉన్న విద్యార్థుల వర్గపోరుకు బుధవారం జరిగిన ఘటన ఆజ్యం పోసింది.వసతి గృహంలోని మెస్ వద్ద ఘర్షణ చోటుచేసుకుంది. -8లో



ఐదో రోజూ.. అదే జోరు

మహాగణపతి ఉత్సవాలు బుధవారం ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన గణనాథుని లడ్డూ వేలం పాటలో భక్తులు పోటాపోటీగా పాల్గొన్నారు. -8లో

గరిష్టం/కనిష్టం
36.2/25.0

వాతావరణం

జిల్లాలో బుధవారం 25.0 – 36.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 6.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు గడువు పొడిగింపు

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం(ఓపెన్ స్కూల్) ద్వారా 2024–25 విద్యా సంవత్సరంలో పదవ తరగతి, ఇంటర్ కోర్సులలో ప్రవేశాలకు సంబంధించిన గడువును ఈ నెల 15వ తేదీ వరకు పెంచినట్లు ఓపెన్ స్కూల్ జిల్లా కో–ఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డి, డీఈఓ మర్రెడ్డి అనూరాధ సంయుక్త ప్రకటనలో తెలిపారు. దీంతోపాటు రూ. 200 అపరాధ రుసుంతో ఈనెల 25వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అలాగే జిల్లాలోని ఓపెన్ స్కూల్ ఏవన్ సమన్వయకర్తలందరూ అడ్మిషన్ ప్రక్రియను గడువులోపు పూర్తి చేయాలని కోరారు.

ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్‌గా అమరేంద్ర కుమార్



వేంపల్లి: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్ సంద్రా నియమితులయ్యారు. బుధవారం ఈ మేరకు ఆర్జీయూకేటీ వైస్ ఛాన్స్‌లర్ విజయ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన గతంలో ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ డైరెక్టర్‌గా పని చేశారు. సివిల్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అమరేంద్ర కుమార్ సంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో ట్రిపుల్ ఐటీల అభివృద్ధికి శాయ శక్తుల కృషి చేస్తానని తెలియజేశారు.

'జపాన్'లో ఉద్యోగావకాశాలు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నవీస్ హెచ్‌ఆర్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్ చదివిన అభ్యర్థులకు జపనీస్ భాష నేర్పడంతోపాటు జపాన్ దేశంలో ఉద్యోగ కల్పనకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డి.నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు. 32 ఏళ్లలోపు కలిగి జపాన్‌లో పనిచేసేందుకు ఆసక్తిగల అభ్యర్థులు దర ఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. శిక్షణకు సంబంధించి రూ. 3 లక్షల రుసుము, రిజిస్ట్రేషన్‌కు రూ. 50 వేలు చెల్లించాల్సి ఉండగా, రిజిస్ట్రేషన్ రూపంలో 25 వేలు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చెల్లిస్తుందని వివరించారు. శిక్షణ రుసుమును ఉద్యోగంలో చేరిన తర్వాత 12 విడతలలో అభ్యర్థి చెల్లించాల్సి ఉంటుందన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి జపాన్‌లో నెల కు లక్షా 10 వేల నుంచి రూ. లక్షా 40 వేలు వేత నం లభిస్తుందన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 16లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు 9908808914 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పీజీ ఫలితాలు విడుదల

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ 2వ సెమిస్టర్ ఫలితాలను విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథ్ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య ఎన్. ఈశ్వర్ రెడ్డితో కలిసి బుధవారం సాయంత్రం తన ఛాంబర్లో విడుదల చేశారు. ఉత్తమ ఫలితాలు సాధించిన శాఖలను, విద్యార్థులను అభినందించారు.

లా ఫలితాలు విడుదల: ఇదే సందర్భంలో వారు ఐదేళ్ల ఎల్.ఎల్.బి మొదటి సెమిస్టర్, మూడేళ్ల ఎల్.ఎల్.బి తొలి సెమిస్టర్ ఫలితాలను విడుదల చేశారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సహాయ అధికారులు డాక్టర్ కే. శ్రీనివాసరావు, గంగయ్య, మమత పాల్గొన్నారు.

ఇద్దరు సబ్ రిజిస్ట్రార్‌లపై కేసు నమోదు

కడప అర్బన్: కడప నగరంలోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో పని చేస్తున్న ఇద్దరు సబ్ రిజిస్ట్రార్‌లపై రిమ్స్ పీఎస్‌లో కేసు నమోదైంది. వివిధ స్థలాల రిజిస్ట్రేషన్‌లను అక్రమంగా నిర్వహించారని వచ్చిన ఫిర్యాదుల మేరకు రాజశేఖర్, వెంకటేష్‌లపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బదిలీల కౌన్సెలింగ్



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న డీపీఓ తదితరులు


కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలోని గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శుల బదిలీలకు సంబంధించిన కౌన్సెలింగ్ బుధవారం జెడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో జరిగింది. మొత్తం 118 మంది పంచాయతీ కార్యదర్శులకుగాను 116 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. జిల్లా పంచాయతీ అధికారి డి.ప్రభాకర్ రెడ్డి, డీపీఓ కార్యాలయ ఏఓ ఖాదర్‌బాషా, బద్వేలు డీఎల్‌డీఓ రమణారెడ్డి, డీపీఆర్‌సీ కో–ఆర్డినేటర్ ప్రసాద్ అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. స్పౌజ్, మెడికల్ గ్రౌండ్స్, మ్యూచువల్ వంటి అంశాలకు సంబంధించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈనెల 15వ తేదీ బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులను పంపుతామని డీపీఓ తెలిపారు.

బాబుకు కడపంటే మంట!

సీఎం చంద్రబాబు కడపపై మరోసారి వివక్ష చూపించారు. ఇక్కడి ప్రజలు టీడీపీకి అధిక సీట్లు కేటాయించినా సరే.. తనలోని మోసపు నైజాన్ని.. సీమపై తన నిజస్వరూపాన్ని బయటపెట్టారు. పులివెందుల మెడికల్ కళాశాలకు సీట్లు కేటాయించొద్దంటూ ఎన్‌ఎంసీకి లేఖ రాసి వైఎస్ ఫ్యామిలీకి కంచుకోటగా ఉన్న పులివెందులపై తన కడుపుమంటను మరోమారు వెళ్లగక్కారు.

- పులివెందుల మెడికల్ కళాశాలపై వివక్ష..
- సీట్ల కేటాయింపుపై ఎన్‌ఎంసీ అనుమతులిచ్చినా అండర్ టేకింగ్ లెటర్ ఇవ్వని సీఎం చంద్రబాబు
- ఫ్యాకల్టీ ఉన్నా ఈ ఏడాది ఎంబీబీఎస్ సీట్ల భర్తీ లేనట్లే
- రాష్ట్ర ప్రభుత్వ వివక్షపై మండిపడుతున్న జిల్లా వాసులు





పులివెందుల మెడికల్ కళాశాల

సాక్షి ప్రతినిధి, కడప: 'నేను రాయలసీమలోనే పుట్టాను, సీమ బిడ్డనం'టూ జబ్బలు చరుచుకునే సీఎం చంద్రబాబు అవన్నీ మాటలకేనని రుజువు చేశారు. తాజాగా పులివెందుల మెడికల్ కాలేజీకి మంజూరైన 50 మెడికల్ సీట్లు వద్దంటూ నేషనల్ మెడికల్ కమీషన్‌కు లేఖ రాసి కడపపై తన అక్కసును బయట పెట్టారు. చంద్రబాబు తీరుపై జిల్లా వాసులు భగ్గుమంటున్నారు. చంద్రబాబుకు రాయలసీమ ప్రజల ఓట్లు కావాలి ..సీట్లు కావాలి.. కానీ..ఇక్కడ అభివృద్ధి ఆయనకు పట్టదంటూ తూర్పారబడుతున్నారు.

అభివృద్ధే లక్ష్యంగా...

సీమ అభివృద్ధికి దివంగత సీఎం వైఎస్సార్, మాజీ సీఎం వైఎస్ జగన్ విశేష కృషి చేశారు. ఇక సొంత గడ్డపైన మమకారంతో పులివెందులను మరింతగా అభివృద్ధి చేశారు. అందుకే దశాబ్దాలుగా పులివెందుల ప్రజలు వైఎస్ కుటుంబానికి పట్టం కడుతూ వస్తున్నారు. అక్కడ ప్రజలకు వైఎస్ రాజశేఖరరెడ్డి సాగునీరు తీసుకొచ్చి పంటలను సస్యశ్యామలం చేశారు. ఇక వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా పరిశ్రమలతోపాటు ఓ మెడికల్ కాలేజీ నిర్మాణం కూడా చేపట్టారు. సామాన్యులకు ఉన్నత స్థాయి వైద్యం అందించేందుకు సంకల్పించి.. రూ.500 కోట్లతో పులివెందుల మెడికల్ కాలేజీ నిర్మాణం చేపట్టారు. తాజాగా ఎన్‌ఎంసీ అనుమతులు కూడా దక్కాయి. ఈఏడాది 50ఎంబీబీఎస్ సీట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాకపోతే పెండింగ్ పనులు పూర్తి చేస్తామని ధ్రువీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ కోరింది. ఇక్కడే చంద్రబాబుకు ఓ సాకు దొరికింది. పూర్తయిన పనులు కొనసాగించేందుకు చంద్రబాబు సర్కార్‌కు మనసు రాలేదు. అంతే.. సీట్లు అవసరం లేదంటూ ఎన్‌ఎంసీకి లెటర్ రాసి కక్ష సాధింపు చర్యల్లో పరాకాష్టకు చేరారు.

ఫ్యాకల్టీ...వసతులున్నా...

ఎన్‌ఎంసీ చైర్మన్ డాక్టర్ బీఎన్ గంగాధర్ నేతృత్వంలో 2024 జూలై 31న ఎన్‌ఎంసీ కమిటీ సమావేశమై పులివెందుల ప్రభుత్వ మెడికల్ కళాశాల రికార్డులు, ఫ్యాకల్టీ, వసతులను పరిశీలించారు. అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజీ, మైక్రో బయాలజీ విభాగాలు పరిశీలన తర్వాత సంతృప్తి చెంది, 50ఎంబీబీఎస్ సీట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోనే కాదు...దేశంలోని ఏ రాష్ట్రం అయినా మాకు అదనంగా మెడికల్ సీట్లు ఇవ్వండి అంటూ ఎన్‌ఎంసీని ప్రాధేయపడుతుంటాయి. అక్కడి విద్యార్థులకు అదనంగా మెడికల్ సీట్లు కల్పించాలనే తాపత్రయం ఆయా రాష్ట్రాల్లో కనిపిస్తుంది. కానీ మంజూరైన మెడికల్ సీట్లు వద్దంటూ లేఖ రాసిన ఏకైక సీఎంగా చంద్రబాబు దేశ చరిత్రలో అపఖ్యాతి మూటగట్టుకున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

నాడూ అదే వివక్ష

ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో పద్మావతి మెడికల్ కళాశాలల్లో సీట్లు రాయలసీమ విద్యార్థులతోనే భర్తీ చేయాలనే నిబంధనలను నాటి చంద్రబాబు సర్కార్ తోసి పుచ్చుతూ జీఓ 130 తీసుకొచ్చి రాయలసీమకు అన్యాయం చేసింది. తాజాగా ఎస్వీ యూనివర్శిటీ పరిధిలో పులివెందుల మెడికల్ కళాశాలకు 50సీట్లు ఎన్‌ఎంసీ కేటాయిస్తే చంద్రబాబు సర్కార్ మోకాలొడ్డుతోంది. స్వతహాగా సీఎం చంద్రబాబుకు రాయలసీమ అన్నా.. ముఖ్యంగా కడప, పులివెందుల అన్నా ఎక్కడ లేని కోపం, ఆక్రోశం వస్తుంది. 2014లో గెలిచిన తర్వాత ఏకంగా బహిరంగ సభలోనే మీరు నాకు ఓటేశారా...మీకు అభివృద్ధి చేయడానికి..? అంటూ ప్రశ్నించారు. ఈమారు ఓట్లు సీట్లు ఇచ్చినా ఈప్రాంతం పట్ల అక్కసు, అసూయ పోవడం లేదని పలువురు మండిపడుతున్నారు. తక్షణమే పులివెందుల మెడికల్ కళాశాలలో సీట్ల భర్తీకి అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ప్రజాప్రతినిధులు ప్రతిఘటించాలి



పులివెందుల మెడికల్ కళాశాలకు రాష్ట్ర ప్రభుత్వం అండర్ టేకింగ్ ఇవ్వకపోవడం రాయలసీమపై ఉన్న కక్షను తెలియజేస్తుంది. సీఎం చంద్రబాబు అతి ముఖ్యమైన ప్రజారోగ్య రంగాన్ని నిర్లక్ష్యం చేయడం బాధాకరం. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పులివెందులలో మెడికల్ కళాశాల నిర్మిస్తే బాబు వైఖరి వల్ల నేడు దాని ఫలితాలు అందని పరిస్థితి ఏర్పడింది. వైద్య రంగాన్ని ప్రైవేటుపరం చేయడంలో అర్థం లేదు.అధికార పార్టీ ఎమ్మెల్యేలు నోరు మెదపకపోవడం విచారకరం. రాయలసీమ ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రతిఘటించాలి.
– సీహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యక్షులు, రాయలసీమ కార్మిక కర్షక సమితి

'సీమ'పై వివక్ష సరికాదు



చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహిస్తోంది. గత ప్రభుత్వం పులివెందులలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలకు ఫ్యాకల్టీ తదితర విషయాల్లో రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన అండర్ టేకింగ్ ఇవ్వడానికి ఆసక్తి చూపకపోవడం విచారకరం. రాయలసీమ పట్ల వివక్ష ప్రదర్శించడం సరికాదు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని ప్రాంతాలను సమ దృష్టితో చూడాలి.
– ఎ.రఘునాథరెడ్డి, సామాజిక కార్యకర్త, కడప

వివక్ష తగదు



ప్రభుత్వాలు ఏవైనా విద్యాభివృద్ధికి సంబంధించిన విషయాల్లో వివక్ష సరికాదు. ఇలాంటి నిర్ణయాల వల్ల పేద, మధ్య తరగతికి చెందిన పిల్లలకు అన్యాయం జరిగే అవకాశం ఉంటుంది. ప్రస్తుత ఎన్‌డీఏ ప్రభుత్వం పులివెందుల మెడికల్ కళాశాలకు అండర్ టేకింగ్ లెటర్ ఇచ్చి ఉంటే 50 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరి ఉండేది.
– వేణుగోపాల్‌రెడ్డి, రాయనపల్లి, చెన్నూరు

విద్యార్థులకు అన్యాయం



పులివెందుల పట్టణంలోని కడపరోడ్డులో గత ప్రభుత్వం సుమారు 56 ఎకరాల్లో రూ.500కోట్లతో మెడికల్ కళాశాలను నిర్మించింది. కూటమి ప్రభుత్వం పులివెందుల మెడికల్ కళాశాలకు కేటాయించిన సీట్లను వెనక్కి తీసుకోమని చెప్పడంతో ఈ ప్రాంతంలో చదువుతున్న మెడికల్ విద్యార్థులకు అన్యాయం చేసినట్లయింది.
– కోళ్లభాస్కర్, పులివెందుల

ఉన్నత లక్ష్యాన్ని నీరుగార్చారు



పులివెందుల ప్రాంతంలోని నిరుపేదలకు మెరుగైన వైద్యసేవలు అందించే విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెడికల్ కళాశాలను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందాలంటే దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇక్కడే నాణ్యమైన విద్యతో పాటు వైద్యం అందించవచ్చన్న లక్ష్యంతో కళాశాలను ఏర్పాటు చేశారు. కానీ కూటమి ప్రభుత్వం కొత్త వైద్య కళాశాలకు వసతులు కల్పించలేమని చేతులెత్తేయడం దారుణం.
– అరుణ, పులివెందుల

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న సైబర్ క్రైం సీఐ మధుమల్లేశ్వరరెడ్డి

సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ మధుమల్లేశ్వర్‌రెడ్డి

వైవీయూ: సైబర్ నేరాల పట్ల అవగాహన, అప్రమత్తత అవసరమని కడప సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఎ. మధుమల్లేశ్వరరెడ్డి పేర్కొన్నారు. కడప నగరం తెలుగుగంగకాలనీలో నిర్వహిస్తున్న కంబైన్డ్ ఆన్యువల్ ట్రైనింగ్ క్యాంపులో బుధవారం సైబర్ నేరాల నివారణకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నకిలీ లోన్‌యాప్‌లను మొబైల్ ఫోన్‌లలో ఇన్‌స్టాల్ చేయకూడదన్నారు. అపరిచితులకు వ్యక్తిగత సమాచారాన్ని ఇవ్వకూడదని సూచించారు. సాంకేతికత పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ క్రైమ్స్ పెరుగుతున్నాయని, దీనికి అప్రమత్తతే నివారణ అని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలను టార్గెట్ పెట్టుకుని ఆన్‌లైన్ మోసాలు జరుగుతున్నాయన్నారు. ఈకేవైసీ, ఆధార్ అప్‌డేట్, బ్యాంక్ కాల్స్ అంటూ అపరిచితులు కాల్స్, మెసేజీలు చేస్తూ ఉన్నారని, అలాంటి అపరిచితులకు ఎలాంటి సమాచారం ఇవ్వకూడదని, ఓటీపీ అసలు చెప్పకూడదన్నారు. బ్యాంకువారు ఇలాంటి కాల్స్, మెసేజ్‌లు ఇవ్వరని అవగాహన కల్పించారు. అదే విధంగా ఆన్‌లైన్ గేమ్స్, యాప్స్, బ్యాక్‌డోర్ ఉద్యోగాలు అంటూ నకిలీ వెబ్‌సైట్‌లతో ఉద్యోగార్థులను బురిడికొట్టిస్తున్నారన్నారు. ఏదైనా సైబర్ నేరం జరిగిన వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి స్వయంగా సైబర్‌క్రైమ్.జీఓవి.ఇన్ వెబ్‌సైట్ ఫిర్యాదు చేస్తే బాధితులకు న్యాయం చేస్తామన్నారు. అనంతరం 30 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎస్. సూర్యనారాయణ మూర్తి సీఐని సత్కరించారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ సిబ్బంది తాజుద్దీన్, రెడ్డప్ప, ఎన్‌సీసీ అధికారులు డా. ఆర్. నీలయ్య, డా. మహేష్, నాగరాజు నాయక్, స్వామినాథ్, పరేడ్ శిక్షకులు పాల్గొన్నారు.

వరద ప్రవాహం తగ్గుముఖం



పెన్నాలో పారుతున్న మైలవరం జలాశయం నీరు

జమ్మలమడుగు: శ్రీశైలం ప్రాజెక్టుకు వరద నీరు తగ్గడంతో గాలేరు–నగరి వరద కాలువలకు వచ్చే వరద నీరు తగ్గిందని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతానికి గండికోట జలాశయంలో 23 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా అధికారులు దిగువనున్న మైలవరం జలాశయంలోకి నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం మైలవరం జలాశయంలో 5.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నానదిలోనికి భారీగా వరద నీటిని విడుదల చేస్తామని ఇప్పటికే ప్రకటించిన అధికారులు..తాజాగా నీటి ప్రవాహం తగ్గడంతో నీటి విడుదలపై మీనమేషాలు లెక్కిస్తున్నారు. బుధవారం మైలవరం జలాశయం నుంచి కేవలం రెండు వేల క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేశారు. ఈ నీటి ప్రవాహం పెంచాలా లేక ఇలాగే కొనసాగించాలన్న ఆలోచనలో ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.

గండికోట లోగో రూపకల్పనకు పోటీలు

- 22వ తేది దరఖాస్తులకు చివరి గడువు
- కలెక్టర్ శివశంకర్ లోతేటి



మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప సెవెన్‌రోడ్స్: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 27వ తేది గండికోటలో నిర్వహించే ఉత్సవాలకు సంబంధించిన లోగో డిజైన్, ట్యాగ్ రూపకల్పన పోటీలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, డీఎఫ్‌ఓ సందీప్‌రెడ్డి, డీఆర్వో గంగాధర్‌గౌడ్, స్పెషల్ ఆఫీసర్ సురేష్‌కుమార్, ఇతర అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాలను ఈనెల 27న గండికోట పర్యాటక కేంద్రంలో వైభవంగా నిర్వహించాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా గండికోట డెవలప్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. గండికోట వారసత్వం, సంస్కృతి ప్రతిబింబించే విధంగా ప్రత్యేకమైన, సృజనాత్మకమైన లోగో ట్యాగ్‌లైన్ రూపొందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని వివరించారు. ఉత్తమ లోగోకు రూ.25 వేలు, ఆంగ్లంలో అత్యంత ఆకర్షణీయమైన ట్యాగ్‌లైన్ తయారు చేసినందుకు రూ.15 వేలు నగదు బహుమతిగా అందజేస్తామన్నారు. అభ్యర్థులు తమ పేరు, మొబైల్ నెంబరుతో ఎంట్రీలను విజిట్ గండికోట అట్ జీమెయిల్ డాట్ కామ్‌కు ఈనెల 22వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు పంపాలని సూచించారు. గండికోట పర్యాటకానికి సంబంధించిన అదనపు సమాచారం కోసం ఇన్‌స్టాగామ్, ట్విట్టర్, ఫేస్‌బుక్, విజిట్ గండికోట పేజీలను ఫాలో అవ్వాలని సూచించారు. పర్యాటక దినోత్సవ వేడుకల్లో భాగంగా గండికోటలో కనీస, మౌలిక సదుపాయాలు కల్పించాలని అభివృద్ధి కమిటీ సభ్యులను కలెక్టర్ ఆదేశించారు. జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు, జిల్లా టూరిజం అధికారి రాంకుమార్, గండికోట పంచాయతీ ప్రజలు, టూరిజం అభివృద్ధి కమిటీ సభ్యులు, ఇంటాక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో బాధ్యతగా ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి



అమర వీరుల కుటుంబ సభ్యురాలిని సత్కరిస్తున్న అధికారులు

జాతీయ అటవీశాఖ అమర వీరుల సంస్మరణ దినోత్సవంలో కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్‌ఓలు

కడప కోటిరెడ్డిసర్కిల్: వృత్తి ధర్మాన్ని బాధ్యతాయుతంగా పాటించడంతోపాటు మన ప్రాణాలకు ముప్పు రాకుండా చూసుకోవాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జిల్లా అటవీ శాఖ అధికారి సందీప్ రెడ్డి పేర్కొన్నారు. జాతీయ అటవీశాఖ అమరవీరుల సంస్కరణ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక జిల్లా అటవీశాఖ అధికారి కార్యాలయం ఆవరణలో జాతీయ అటవీశాఖ అమరవీరుల సంస్కరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అత్యధికంగా అటవీ ప్రాంతం ఉండడం జిల్లాకు ఎంతో గర్వకారణమన్నారు. ఇంతగా అటవీ ప్రాంతం ఉందంటే అందులో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది కృషి ఎంతో ఉందన్నారు. అటవీ సంపదను కాపాడుకోవాలని భవిష్యత్ తరాల వారికే కాకుండా ప్రస్తుతం ఉన్న వారి అవసరాలను తీర్చుకోవడమే సుస్థిర అభివృద్ధి అన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి సందీప్ రెడ్డి ఆధ్వర్యంలో అటవీ ప్రాంతాన్ని బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా, అందరినీ కలుపుకుంటూ, సమన్వయం చేసుకుంటూ చక్కగా విధి నిర్వహణలో నిర్వర్తించడం జరుగుతోందని కితాబిచ్చారు. అటవీశాఖ లో ఇంటెలిజెన్స్, కమాండ్ కంట్రోల్‌ను ఏర్పాటు చేసుకోవాలని అందుకు తమ వైపు నుంచి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అటవీ శాఖలో వృత్తి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అశోక్ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. వారి కుటుంబ సభ్యులకు ఇంకా సహాయం చేస్తామన్నారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ అటవీ ప్రాంత సంరక్షణ ఎంతో బాధ్యతాయుతమైన వృత్తి అని కష్టంతోపాటు తెలివిగా విధి నిర్వహణను నిర్వర్తించాలన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి సందీప్ రెడ్డి మాట్లాడుతూ అటవీ ప్రాంత సంరక్షణ మన అందరి బాధ్యత అని విధి నిర్వహణను సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. తొలుత కలెక్టర్ శివశంకర్ లో తేటి, జిల్లా ఎస్పీ హర్షవర్దన్ రాజు, జిల్లా అటవీ శాఖ అధికారి సందీప్ రెడ్డిలు అటవీ శాఖ అమర వీరుల స్థూపం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చివరిగా అటవీ శాఖ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అశోక్‌ను స్మరించుకోవడంతో పాటు అతని తల్లికి జాతీయ అటవీ శాఖ అమరవీరుల దినోత్సవం సందర్భంగా సత్కరించారు. డివిజనల్ అటవీ అధికారులు ప్రభాకర్, నాగార్జున రెడ్డి, అధికారులు, సిబ్బంది, అటవీ శాఖ అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తిరుపతి-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్: దసరా, దీపావళి పండుగల రద్దీ నేపథ్యంలో తిరుపతి–సికింద్రాబాద్–తిరుపతి (07489/07490)ల మధ్య కడప మీదుగా ప్రత్యేక రైలును నడపనున్నారని కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. సికింద్రాబాద్ నుంచి తిరుపతికి అక్టోబరు నెలలో 5, 12, 19, 26, నవంబరులో 2, 9 తేదీల్లో బయలుదేరుతుందన్నారు. అలాగే తిరుపతి నుంచి సికింద్రాబాదుకు అక్టోబరు 8, 15, 22, 29, నవంబరు 5, 12 తేదీలలో నడుస్తుందన్నారు. ఈ రైలు కడప, ఎర్రగుంట్లలో స్టాపింగ్‌లో ఏర్పాటు చేశారన్నారు. సికింద్రాబాదులో శనివారం రాత్రి 10.15 గంటలకు బయలుదేరి కాచిగూడ, హుందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల, కర్నూలు, డోన్, గుత్తి, ఎర్రగుంట్ల, కడప, రేణిగుంట మీదుగా తిరుపతికి మరుసటిరోజు ఉదయం 10.10గంటలకు చేరుతుందన్నారు. తిరిగి ఈ రైలు మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి ఇదే మార్గంలో మరుసటిరోజు తెల్లవారుజామున 4 గంటలకు సికింద్రాబాద్ చేరుతుందన్నారు.ఈ రైలుకు రిజర్వేషన్ సౌకర్యం ఉందని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్లుప్తంగా

భారతి సిమెంట్ తరపున బహుమతులు పంపిణీ



విజేతలకు బహుమతులు అందిస్తున్న భారతి సిమెంట్ సేల్స్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణం బంగారయ్య కొట్టాల ప్రాంతంలో వినాయక చవితిని పురస్కరించుకుని త్రిశూల యూత్ ఆధ్వర్యంలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు భారతి సిమెంట్ యాజమాన్యం తరపున బహుమతులను అందించారు. కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, కార్యక్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి హుండీల ఆదాయం రూ.14.76 లక్షలు

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో బుధవారం 48 రోజుల హుండీలను లెక్కించగా రూ 14,76,755 నగదు, 15 గ్రాముల బంగారం, 200 గ్రాముల వెండి వచ్చినట్లు మేనేజర్ ఈశ్వరాచారి తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, మఠం ఇన్‌చార్జి ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ, తిరుపతి దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్, పూర్వపు మఠాధిపతి కుమారులు, భక్తులు, మఠం సిబ్బంది పాల్గొన్నారు.

1.5 కిలోల గంజాయి పట్టివేత

మైదుకూరు : మైదుకూరు మండలం జెఆర్ రవీంద్రనగర్‌కు చెందిన కొరిగెం శీను అనే అతని వద్ద 1.5 కిలోల గంజాయి ఉండగా పట్టుకుని అరెస్టు చేసినట్లు సీఐ సయ్యద్ హసం బుధవారం తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

కమలాపురం : పట్టణ పరిధిలోని కె.అప్పాయపల్లె పొలాలకు వెళ్లే దారిలో విద్యుదాఘాతానికి గురై ఎద్దు మృతి చెందింది. మండల పరిధిలోని టి.చదిపిరాళ్లకు చెందిన రైతు రఘురాం తన ఎద్దుల బండితో పాపాఘ్ని నదిలో నుంచి ఇసుక తీసుకుని వస్తుండగా దారి మధ్యలో ఎద్దు విద్యుదాఘాతానికి గురైంది. పొలాల దారి కావడంతో దారి మధ్యలో ఒక చోట నీళ్లు నిలిచి ఉన్నాయి. నీరు నిల్వ ఉన్న చోటే దారి పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో నీళ్లలో కరెంట్ సరఫరా అయి ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది.

తాళ్లప్రొద్దుటూరులో పోలీసుల బాహాబాహీ

కొండాపురం : ప్రజలకు భద్రత కల్పించాల్సిన పోలీసులే బాధ్యత మరిచి బాహాబాహీకి దిగిన సంఘటన కొండాపురం మండలంలో వెలుగు చూసిది. మండలంలోని తాళ్లప్రొద్దుటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో వినాయక చవితి మండపాల వద్ద మైకు డీజేలకు అనుమతి ఇస్తూ వారి వద్ద నుంచి ఓ హెడ్‌కానిస్టేబుల్, మరో కానిస్టేబుల్ డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం. ఆ డబ్బును పంచుకోవడంలో తేడా రావడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో పరస్పరం వాగ్వాదం చేసుకుని బాహాబాహీకి దిగినట్లు తెలిసింది. బాధ్యతగా ఉండాల్సిన పోలీసులే ఇలాంటి ఘటనకు పాల్పడటమేమిటని ప్రజలు చర్చించుకుంటున్నారు.

వైవీయూలో విద్యార్థుల మధ్య ఘర్షణ

- ఒకరికి రక్త గాయాలు
- మరో గ్రూపు విద్యార్థుల దాడిలో గెస్ట్‌హౌస్ అద్దాలు ధ్వంసం
- ఐదుగురు విద్యార్థులపై కేసు నమోదు



రక్తగాయమైన మైక్రో బయాలజీ విద్యార్థి సురేష్

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో నివురుగప్పిన నిప్పులా ఉన్న విద్యార్థుల వర్గపోరుకు బుధవారం జరిగిన ఘటన ఆజ్యం పోసింది. ఉదయం విశ్వవిద్యాలయం అనుబంధ వసతి గృహంలోని మెస్ వద్ద ఘర్షణ చోటుచేసుకుంది. ఎంఎస్సీ మైక్రోబయాలజీ విద్యార్థి సురేష్, ఇంటిగ్రేటెడ్ ఎర్త్‌సైన్స్ విభాగం విద్యార్థి స్వామి మధ్య మాటామాటా పెరిగి స్వల్ప ఘర్షణ చోటు చేసుకుంది. ఈ క్రమంలో సురేష్ తన చేతిలో ఉన్న ప్లేట్‌తో స్వామిపై విసిరికొట్టాడు. అనంతరం వారిరువురూ వారి గదులకు వెళ్లిపోగా స్వామి తన గదికి వెళ్లి తోటి విద్యార్థులకు చెప్పడంతో ఇంటిగ్రేటెడ్ విద్యార్థులు ఒక్కసారిగా సురేష్ వద్దకు దాదాపు 20 మంది విద్యార్థులు విచ్చేసి సమీపంలో ఉన్న రైలింగ్ రాడ్‌తో దాడి చేశారు. దీంతో అతని తలకు రక్తగాయమైంది. వెంటనే సమీపంలోని వైవీయూ హెల్త్‌సెంటర్‌కు తీసుకువెళ్లి ప్రాథమిక చికిత్స చేయడంతో పాటు తలకు 5 కుట్లు వేశారు. విషయాన్ని సురేష్ తమ కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో వారు విశ్వవిద్యాలయానికి చేరుకుని దాడిచేసిన వారిపై ప్రతిదాడి చేసేందుకు యత్నించారు. ఈ క్రమంలో విశ్వవిద్యాలయం అతిథి గృహంలో ఓ ఆచార్యుడు ఉంటున్న గదిలో విద్యార్థులు ఉండగా వారిపై దాడి చేసేందుకు యత్నించగా, గెస్ట్‌హౌస్ అద్దాలు ధ్వంసమయ్యాయి. వైవీయూ అధికారుల సమాచారంతో కడప రూరల్ సీఐ చల్లనిదొర విశ్వవిద్యాలయానికి విచ్చేసి ఇరువర్గాల విద్యార్థులను మందలించడంతో పాటు, దాడికి పాల్పడిన ఐదుగురు విద్యార్థులను విచారణ నిమిత్తం పెండ్లిమర్రి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసినట్లు పెండ్లిమర్రి పోలీసులు తెలిపారు.

కాగా కొద్దిరోజులుగా మెస్ కమిటీ నిర్వహణ, ఆధిపత్య పోరులో భాగంగా గతంలో సైతం వర్గాలుగా విడిపోయి పరస్పరం దూషించుకున్న ఘటనలు ఉన్నాయి. వీటిపై గతంలోనే అధికారుల దృష్టికి తెచ్చినప్పటికీ వారు తేలికగా తీసుకోవడం, వసతి గృహాల పర్యవేక్షణ లోపించడం, ప్రిన్సిపాల్ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా వెళ్లడంతో పాటు వసతిగృహాల బాధ్యులు విద్యార్థుల సమస్యలను పట్టించుకోకపోవడంతో తరచూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

కాగా ఘటన జరిగిన తర్వాత వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య పి. పద్మ వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులందరూ ఐకమత్యంగా ఉండాలని, ఎలాంటి గొడవలకు పాల్పడరాదంటూ సూచించారు.

పోలీస్ అవుట్‌పోస్టు ఏర్పాటుకు డిమాండ్..

విశ్వవిద్యాలయంలో గతంలో పోలీసు అవుట్ పోస్టును ఏర్పాటు చేసినప్పటికీ అది కాలనుక్రమంలో అలంకార ప్రాయంగా మారింది. దీంతో ఇలాంటి ఘటనలు జరగకుండా ఉండాలంటే పోలీసు అవుట్ పోస్టు ఏర్పాటు చేయాలని విద్యార్థి నాయకులు డిమాండ్ చేస్తున్నారు. గాయపడిన సురేష్‌ను రాయలసీమ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి మల్లేల జగదీష్ పరామర్శించారు. దాడిచేసిన వారిపై కేసులు నమోదు చేయాలని కోరారు. వైవీయూ వీసీ, రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్స్‌పై కేసులు నమోదు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వి. గంగాసురేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, అధ్యక్షుడు శివశంకర్‌లు వేర్వేరుగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు.

మా కార్యకర్తలపై దాడులు చేస్తే సహించేది లేదు

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇద్రిస్‌ను పరామర్శిస్తున్న జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి తదితరులు

కమలాపురం : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులపై టీడీపీ మూకలు దాడులు చేస్తే సహించేది లేదని, వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి తెలిపారు. సోమవారం అర్ధరాత్రి మండల పరిధిలోని పందిళ్లపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇద్రిస్‌పై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు దాడి చేశారు. గత ఎన్నికల్లో ఇద్రిస్ వైఎస్సార్‌సీపీకి పని చేశారని వారు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఇద్రిస్ తలకు, చేతులకు గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి బుధవారం బాధితుని నివాసానికి చేరుకుని బాధితుడితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మీరంతా ధైర్యంగా ఉండాలని, మీకు పార్టీతో పాటు తామంతా అండగా ఉంటామని, అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ గత 40 ఏళ్ల చరిత్రలో పందిళ్లపల్లెలో ఇలాంటి దాడులు జరగలేదన్నారు. ప్రస్తుతం టీడీపీ మూకలు ఇలాంటి దాడులకు తెరలేపారని, కొత్త సంస్కృతిని తీసుకు వచ్చారన్నారు. అధికారం శాశ్వతం కాదని, అలాగే తమకు ప్రతిపక్షం కూడా కొత్త కాదన్నారు. తమ పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులపై దాడులకు దిగిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, చెన్నకేశవరెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, శివ కుమార్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, కమాల్ బాషా, జిలానీ బాషా, సాదిక్, శ్రీనివాసరెడ్డి, జావీద్, శివారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రామలక్ష్మీరెడ్డి, కొండారెడ్డి, రామసుబ్బారెడ్డి, సురేష్, సుబ్బన్న, విజేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ఆర్ట్స్ కళాశాల ప్లాటినం జూబ్లీ సెలబ్రేషన్స్

- 13, 14 తేదీల్లో అంగరంగ వైభవంగా నిర్వహణ
- ప్రిన్సిపాల్ జి. రవీంద్రనాథ్



వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్స్ కళాశాల) ఏర్పాటై 75 సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో ఈనెల 13, 14 తేదీల్లో కళాశాలలో ప్లాటినం జూబ్లీ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ తెలిపారు. 1948లో ఏర్పాటైన ఈ కళాశాల రాయలసీమలోనే అత్యంత ప్రాచీనమైన, ప్రతిష్టాత్మక, ప్రసిద్ధ ఉన్నత విద్యాసంస్థ అని పేర్కొన్నారు. ఈ కళాశాలలో చదివిన ఎందరో విద్యార్థులు దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడి తిరిగి కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకల్లో కలుసుకునేందుకు వస్తుండటం సంతోషంగా ఉందన్నారు. ప్లాటినం జూబ్లీ వేడుకల నేపథ్యంలో సెప్టెంబర్ 13, 14 తేదీల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. 13వ తేదీ ఉదయం 2 కే రన్, 75 వసంతాల పైలాన్, పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు, ప్రిన్సిపాల్స్‌కు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పలు అతిథి ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అదే విధంగా 14వ తేదీన జాయ్ ర్యాలీ, అలూమినీ కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వీడ్కోలు సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్లాటినం జూబ్లీ వేడుకలకు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, కడప ఎమ్మెల్యే ఆర్. మాధవిరెడ్డి, విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్, విశ్రాంత చీఫ్ సెక్రటరీ డాక్టర్ కె.ఎస్. జవహర్‌రెడ్డి, కేంద్ర ప్రభుత్వ మాజీ అధికారి ప్రకాష్ రావు, వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, పూర్వపు వైస్ చాన్సలర్‌లు, ఐఏఎస్‌లు, మాజీ ఐఏఎస్‌లు, వివిధ రంగాల ప్రముఖులు హాజరవుతున్నట్లు తెలిపారు.

చిరుతను చూసి భయపడి.. స్కూటీనుంచి కిందపడి..

– ఇరువురికి గాయాలు

ముద్దనూరు : ముద్దనూరు–జమ్మలమడుగు రహదారిలో ఘాట్‌రోడ్డులో చిరుతను చూసి భయంతో తప్పించుకోబోయి స్కూటీనుంచి కింద పడిన ఘటనలో ఇరువురికి కాలు విరిగింది. బాధితుల సమాచారం మేరకు జమ్మలమడుగుకు చెందిన ఇమ్రాన్, ఇబ్రహీం అనే వ్యక్తులు బుధవారం తెల్లవారుజామున స్కూటీపై ముద్దనూరుకు ప్రయాణిస్తున్నారు. మునయ్యకోన దాటిన తర్వాత చిరుత రహదారిని దాటుతుండగా ఇరువురు చూశారు. భయంతో స్కూటీతో రోడ్డు పక్కకు వెళ్లారు. దీంతో స్కూటీ దిగువ ప్రాంతంలో బోల్తాపడింది. ఈ దారిలో వెళ్లేవారు వెలుగుతున్న స్కూటీ లైట్లను చూసి 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. క్షతగాత్రులిద్దరినీ జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వైస్ ఎంపీపీ కుమారునిపై దాడి

– తలకు తీవ్ర గాయాలు

మైదుకూరు : మైదుకూరు మండల వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి కుమారుడు ఊటుకూరు తరుణ్ కుమార్‌రెడ్డిపై కొందరు దాడి చేశారు. సంఘటనలో బాధితుడి తలకు తీవ్ర రక్త గాయాలయ్యాయి. మంగళవారం రాత్రి జరిగిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తువ్వపల్లెకు చెందిన ఊటుకూరు రఘురామిరెడ్డి జీవీ సత్రంలో నివాసం ఉంటున్నారు. మంగళవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో జీవీ సత్రం గ్రామానికి చెందిన ఖదీర్, ఉప్పుగుంటపల్లె గ్రామానికి చెందిన శివ మరి కొందరు రఘురామిరెడ్డి ఇంటి సమీపంలో ఆయన కుమారుడు తరుణ్ కుమార్‌రెడ్డిపై కట్టెలతో దాడి చేసి తలపై కొట్టారు. తరుణ్ కుమార్‌రెడ్డి తలకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. మనస్పర్థలే కారణమని తెలుస్తోంది. సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పరామర్శ

దాడిలో తీవ్రంగా గాయపడిన తరుణ్‌కుమార్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, ఆర్టీసీ రీజినల్ మాజీ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి పరామర్శించారు. మండలంలోని జీవీ సత్రం, పరిసర గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం పెద్ద సంఖ్యలో రఘురామిరెడ్డి ఇంటి వద్దకు చేరుకొని ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నేట్లపల్లి శివరాం, రామశివారెడ్డి, ఎం.నరసింహారెడ్డి, వెంకటయ్య తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

అలా అమ్మారు.. ఇలా చోరీ చేశారు..

బ్రహ్మంగారిమఠం : మండలంలోని లింగాలదిన్నెపల్లెకు చెందిన లెక్కల భాస్కర్‌రెడ్డి సుజికి డిజైర్ కారు చోరీకి గురైన కేసును బి.మఠం పోలీసులు ఛేదించారు. బుధవారం రాత్రి బి.మఠంలో రూరల్ సీఐ శివశంకర్ విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం తెల్లవారుజామున భాస్కర్‌రెడ్డి ఇంటి దగ్గర ఉన్న కారును ఇతనికి కారు అమ్మిన రామనాథ్‌రెడ్డి, హరికృష్ణారెడ్డిలే దొంగిలించినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ఎస్ఐ చంద్రశేఖర్, పోలీస్ బృందం వారి కదలికలపై నిఘా ఉంచారు. బుధవారం ఎర్రగుంట్ల మండలం వై.కోడూరు సమీపంలో కారుతోపాటు బైకును అదుపులోకి తీసుకొన్ని పోలీసులు అరెస్టు చేశారు.

17న అరుణాచలానికి ప్రత్యేక సర్వీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణాచలానికి ఈనెల 17వ తేదీన జిల్లాలోని వివిధ డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులను నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు.

- కడప డిపో నుంచి ఉదయం 5.00 గంటలకు సూపర్ లగ్జరీ, 6.00 గంటలకు ఇంద్ర సర్వీసును నడుపుతున్నామన్నారు. ఈ బస్సు రాయచోటి, చిత్తూరు, వేలూరు మీదుగా అరుణాచలానికి చేరుతుందన్నారు. ఇందులో పెద్దలకు రూ. 1072, రూ. 1600 చార్జిగా ఉందన్నారు.
- బద్వేలు డిపో నుంచి ఉదయం 7.00 గంటలకు రెండు సూపర్ లగ్జరీ బస్సులు బయలుదేరుతాయన్నారు. ఈ బస్సులు పెంచలకోన, శ్రీకాళహస్తి, గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా నడుస్తాయన్నారు. ఈ బస్సుల్లో రూ. 1668గా నిర్ణయించామన్నారు.
- మైదుకూరు డిపోనుంచి ఉదయం 6.00 గంటలకు ప్రత్యేక బస్సు పోరుమామిళ్లలో బయలుదేరి కడప, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా వెళుతుందన్నారు. ఇందులో చార్జి రూ. 1414గా ఉందన్నారు. మరొక బస్సు ఉదయం 7.00 గంటలకు కడప, చిత్తూరు మీదుగా వెళుతుందన్నారు. ఇందులో రూ. 1209 చార్జిగా నిర్ణయించామన్నారు.
- ప్రొద్దుటూరు డిపో నుంచి సాయంత్రం 7.00 గంటలకు బయలుదేరి మైదుకూరు, కడప మీదుగా అరుణాచలం వెళుతుందన్నారు. ఇందులో రూ. 1273 చార్జిగా ఉందన్నారు.
- పులివెందుల డిపో నుంచి ఉదయం 7.00 గంటలకు బయలుదేరి రాయచోటి, పీలేరు మీదుగా అరుణాచలానికి వెళుతుందన్నారు. ఇందులో రూ. 1193గా టిక్కెట్ ఉందన్నారు.
- జమ్మలమడుగు డిపోనుంచి ఉదయం 5.00 గంటలకు ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప మీదుగా వెళుతుందన్నారు. ఇందులో చార్జి రూ. 1352గా ఉందన్నారు. మరొక బస్సు మధ్యాహ్నం 1.30 గంటలకు కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా వెళుతుందన్నారు. ఇందులో రూ. 1568 టిక్కెట్ ధరగా నిర్ణయించామన్నారు.

ఈ సర్వీసులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని, ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఎం కోరారు.

ఉద్యోగం రాలేదని యువతి ఆత్మహత్య



ఖాదరబాదర అభినయ (ఫైల్)

కడప కోటిరెడ్డిసర్కిల్ : డిగ్రీ వరకు చదువుకున్నా ఎలాంటి ఉద్యోగం రాలేదనే మనస్థాపంతో ఖాదరబాదర అభినయ (21) అనే యువతి ఆత్మహత్య చేసుకుంది. కడప నగరం శివానందపురానికి చెందిన అభినయ కంప్యూటర్ కోర్సులు పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు కొనసాగించేది. అయితే అన్ని ప్రయత్నాలు విఫలం కావడంతో మనస్థాపం చెంది ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం తెలిసిన రిమ్స్ పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు. ఈ మేరకు తండ్రి ఓబులపతి ఫిర్యాదు మేరకు ఎస్ఐ జయరాములు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

జమ్మలమడుగు రూరల్ : దేవగుడి గ్రామంలోని బైపాస్ రోడ్డులో ట్రాక్టర్ ఢీ కొన్న సంఘటనలో పాచిరెడ్డి సుదర్శన్‌రెడ్డి (40) అనే వ్యక్తి మృతి చెందగా మేనల్లుడు కాసేంద్రరెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. ఏఎస్ఐ మురళీ యాదవ్ కథనం మేరకు.. పెద్దముడియం మండలం పెద్దపసుపల గ్రామానికి చెందిన పాచిరెడ్డి పుల్లారెడ్డి, వెంకటసుబ్బమ్మకు ఇద్దరు కుమారులు. వారిలో పెద్ద కుమారుడు పాచిరెడ్డి సంజీవరెడ్డి కాగా రెండవ కుమారుడు సుదర్శన్‌రెడ్డి. జమ్మలమడుగు పట్టణంలోని నాగలకట్టవీధిలో నివాసముంటున్న సుదర్శన్‌రెడ్డి బేల్దారి పనులు చేసుకొని జీవించేవాడు. చిత్తూరు జిల్లా కలికిరిలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న మేనల్లుడు కాసేంద్రరెడ్డితో కలిసి బుధవారం ఉదయం బైకుపై కలికిరికి బయలుదేరారు. జమ్మలమడుగు మండలం దేవగుడి గ్రామ బైపాస్ రోడ్డుపై వెళుతుండగా వెనుకవైపు నుంచి ట్రాక్టర్ ఢీకొంది. ఈ సంఘటనలో సుదర్శన్‌రెడ్డి తలకు, ఛాతీకి తీవ్ర గాయాలు కాగా మేనల్లుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. వెంటనే స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో సుదర్శన్‌రెడ్డిని ప్రొద్దుటూరుకు తరలించారు. డాక్టర్ల సూచన మేరకు కర్నూలుకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా రెండేళ్లక్రితం కరోనాతో పాచిరెడ్డి సంజీవరెడ్డి మృతి చెందగా ఇప్పుడు చిన్న కుమారుడు సుదర్శన్‌రెడ్డి మృతి చెందడంతో తల్లిదండ్రులు తాము ఎవరి కోసం బతకాలంటూ ఆసుపత్రి ఆవరణంలో కన్నీరు మున్నీరయ్యారు.

ఐదో రోజూ.. అదే జోరు



వినాయకస్వామి ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే ఆకేపాటి



ఎంజీ పురంలో రూ.1 లక్షా 67 వేలకు లడ్డూను దక్కించుకున్న వెంకటసుబ్బయ్య



రూ.1 లక్షా 40 వేలకు లడ్డూను దక్కించుకున్న లక్ష్మీకర్‌రెడ్డి

- పోటా పోటీగా గణనాథుని లడ్డు వేలం పాటలు
- రూ.లక్షల్లో దక్కించుకున్న భక్తులు

రాజంపేట రూరల్ : మహాగణపతి ఉత్సవాలు బుధవారం ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో గణనాథులు నిమజ్జనానికి కదిలారు. ఆకేపాటి ఎస్టేట్ వద్ద ఉన్న ఆకేపాటి కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన వినాయకస్వామికి 5వ రోజు నిర్వహించిన ప్రత్యేక పూజలలో ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పాల్గొన్నారు. అనంతరం వినాయకస్వామి ఉత్సవ విగ్రహం ఎస్టేట్‌కు వచ్చిన సమయంలో ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, జ్యోతమ్మ దంపతులు హారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అదే విధంగా ఎంజీ పురంలో వినాయక చవితి 20వ వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన వేలం పాటలో అదే గ్రామానికి చెందిన గొడ్డేటి వెంకటసుబ్బయ్య రూ. 1 లక్షా 67 వేలు అధిక వేలం ధరకు స్వామి వారి లడ్డును దక్కించుకున్నారు. సాయినగర్‌లో నిర్వహించిన వేలం పాటలో పోలి లక్ష్మీకర్‌రెడ్డి రూ. 1 లక్షా 40 వేలకు స్వామి వారి లడ్డూను దక్కించుకున్నారు. ఈ నిమజ్జన వేడుకల్లో మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రూ. 60 వేలు పలికిన వినాయకుని లడ్డు

సుండుపల్లె : మండల కేంద్రానికి సమీపంలోని అగ్రహారం వినాయకుని మండపం వద్ద నిర్వహించిన లడ్డు వేలం పాటలో కోటకొండ రోశయ్య రూ. 60 వేలకు దక్కించుకున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. అలాగే కలశం, టెంకాయను వెంకటరమణ రూ. 23,500లకు, రూపాయి బిళ్లను వెంకటేష్ రూ. 18 వేలకు వేలంలో దక్కించుకున్నట్లు తెలిపారు.



ఏటిగడ్డ రాచపల్లిలో గ్రామస్తులు నిర్వహించిన లడ్డు వేలంపాటలో అడ్డపల్లి నాగరాజు రూ. 32 వేలకు దక్కించుకున్నారు.

నందలూరు మండలంలో..



నందలూరు : నందలూరు గ్రామ పంచాయతీ నీలిపల్లి గ్రామంలో వినాయక స్వామి లడ్డు వేలం పాటలో ఉప్పుశెట్టి నరసింహులు అత్యధికంగా రూ. 1 లక్షా 5 వేలకు స్వామివారి లడ్డును దక్కించుకున్నారు. ఉప్పుశెట్టి సుధీర్ కుమార్, ఉప్పుశెట్టి హరికృష్ణ, ఉప్పుశెట్టి ప్రసాద్, దాసరి కాటయ్య, ఉప్పుశెట్టి కొండయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేముల మండలంలో..

వేముల: వేములలో బుధవారం వినాయకుని లడ్డును వేములకు చెందిన చందా రమేష్‌రెడ్డి రూ.1.11 లక్షలకు దక్కించుకున్నారు. అనంతరం వినాయకుని నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఓబులవారిపల్లెలో..



ఓబులవారిపల్లె: మండలంలోని చిన్నఓరంపాడు, దిగువపల్లి గ్రామంలో బుధవారం వినాయక లడ్డు వేలం పాటలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ ముక్కా శైలజ రమేష్ రెడ్డి స్వామివారి లడ్డును రూ. 80 వేలకు కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

లింగాల మండలంలో..

లింగాల : లింగాల మండలం పెద్దకుడాల గ్రామంలో వినాయకుని లడ్డును గ్రామానికి చెందిన పెద్దమల్లు లక్ష్మినారాయణరెడ్డి రూ.లక్షకు కైవసం చేసుకున్నారు. ఆయనను వినాయకుని ఉత్సవ కమిటీ ఘనంగా సత్కరించింది.



జమ్మలమడుగులో..



జమ్మలమడుగు : పట్టణంలోని సిద్ధి వినాయక సేవా సమితి ఆధ్వర్యంలో ఈశ్వర నగర్‌లో స్వామి వారి వద్ద ఉంచిన చెరుకు గడ్డలు, కలశం చెంబు, లడ్డులను వేలంపాట నిర్వహించారు. రెండు వందల రూపాయల విలువ గల చెరుకు గడలను రామకృష్ణారెడ్డి రూ.10,100కు దక్కించుకున్నారు. కలశం చెంబు రూ.600 విలువ ఉంటే మమతాదేవి రూ.42 వేలకు, వెండి విగ్రహాన్ని రూ.61వేలకు రామకృష్ణారెడ్డి దక్కించుకున్నారు. లడ్డును అత్యధికంగా రూ.71వేలకు టి.మనోజ్‌కుమార్ దక్కించుకున్నారు.

పోరుమామిళ్ల మండలంలో..

పోరుమామిళ్ల : రంగసముద్రం రెడ్డినగర్‌లోని శ్రీ వరసిద్ధి వినాయక కోదండ రామస్వామి ఆలయం వద్ద బుధవారం నిర్వహించిన వేలంలో రూ. 54 వేలతో చిలమల రామసుబ్బయ్య లడ్డును దక్కించుకున్నారు. వెంగమాంబ నగర్ వద్ద రూ. 51 వేలతో సుంకర ప్రసాద్, లక్ష్మిదేవి దంపతులు, పట్టణంలోని కోటవీధిలో రూ. 49 వేలకు చెన్ను వెంకటరమణ, శీనప్పబావివీధిలో 300 కేజీల లడ్డును రూ. 21 వేలకు బావులూరి వెంకటేష్, చితానందనగర్‌లో రూ. 27 వేలకు రమణయ్య వినాయక లడ్డును సొంతం చేసుకున్నారు. ఇదిలా ఉండగా రంగసముద్రం పంచాయతీ కమ్మవారిపల్లెలో నిర్వహించిన లడ్డు వేలంలో పాద రమణయ్య రూ.1,35,000కు లడ్డును సొంతం చేసుకున్నారు. ఈ సంవత్సరం మండలంలో ఇదే అత్యధిక వేలంగా భావిస్తున్నారు.



కలసపాడులో..



కలసపాడు : మండలంలోని దూలంవారిపల్లె గ్రామంలో లడ్డు వేలం పాటలో గ్రామానికి చెందిన పంజగల వెంకటేష్ రూ.లక్షకు లడ్డును దక్కించుకున్నారు. అలాగే రూ.11,300లకు కలశంను కూడా దక్కించుకున్నారు.